
రేపు దీపావళి.

నిన్నరాత్రి బండికే అక్కా బావా దిగారు.

అసలు వద్దామనుకోలేదు. రైలెక్కడమంటే హడలుగా వుంది. కిందటి మాటు దీపావళికి కూడా రాలేకపోయినాం గదా అని నేనే బలవంత పెట్టి ఆయన్ని బయల్దేరదీశా" అన్నది అక్క..

" అయ్యో! అదేమిటి? మనకింతకంటె పెద్ద పండుగ లేదుగదా. వద్దామనుకోకపోవడమేమిటి? చీటికిమాటికీ వస్తూ పోతూ వుండటానికి దూరభారమాయెను! మిమ్మల్నిద్దరిని.పిలిచి పెట్టుకోవాలన్నా. చేసుకోవాలన్నా, ఇప్పుడు కాకపోతే మరెప్పుడే"అన్నది అమ్మ.

"చిట్టిని, బుల్లాణ్ణీ, మిమ్మల్నీ చూసిపోదామని వచ్చాంగాని విందులు కుడవడానికి రాలేదు. మీరేమి వృథాగా డబ్బు తగలెయ్యకండి" అన్నాడు నాన్నతో బావ.




"అదేమిటయ్యా? పండుగన్న తర్వాత ఉన్నంతలో ఏదో చేసుకోవాలిగాని,ఏమీ లేకుండా ఊరుకుంటామా!" అన్నాడు నాన్న.

"చూడమ్మా, ఆయనకుగానీ, నాకుగానీ బట్టలూ అవీ పెట్టకండి. అసలే కరువు రోజులు, రేషనుకార్డుమీద దొరికే గుడ్డ ఏ మూలకీ చాలకుండా వుంది. మీరు గుడ్డ కొనిపెడుతున్నారని తెలిస్తే ఆయనకు చాల కోపం వస్తుంది" అన్నది అమ్మతో అక్క చాటుగా.

అక్క అనుమానపడ్డట్లే రాత్రి ఎనిమిది గంటలకే ఎవరో ఒకాయన చంకలో చిన్న మూట పట్టుకొచ్చాడు. నాన్న ఆయన్ని లోపలికి పిలిచాడు. ఆయన లోపలికొచ్చి మూట విప్పాడు. అందులో చక్కని మిల్లు ధోవతులూ, మిల్లు చీరెలూ వున్నాయి. వాటి ధర కూడ అందంగానే వుంది.

బావ చూస్తూనే వున్నాడు, నాన్న ఒక ధోవతులచాపూ, ఒక చీర కొనడానికి తయారవుతున్నాడు. ఇంతలో బావ నాన్న కడ్డంవచ్చి, "ఈ బట్టలే షాపులోవి?" అని అడిగాడు. బట్టలు పట్టుకొచ్చిన.మనిషి ఆశ్చర్యపడి చూశాడు.

బావ మండిపడ్డాడు. దొంగవ్యాపారం చేసేవాళ్ళందర్నీ కొరతవేయాలన్నాడు. ఇటువంటి భ్రష్టులు అవకాశం చిక్కితే దేశాన్నీ, జాతినీ కూడా దొంగమార్కెట్టులో అమ్మేస్తారన్నాడు. బట్టలు తెచ్చినవాడు గబగబా చుట్ట చంకనపెట్టి జారుకున్నాడు.

"అదేమిటయ్యా? రేపు పండగ్గదా ఏదో విధంగా బట్టలు సంపాదించుకోకపోతే ఎలా?" అన్నాడు నాన్న.

"బీదవాళ్ళకి చౌకగా అందవలసిన ఈ బట్టలు దొంగ వ్యాపారుల దగ్గిర బోలెడంత ధరపోసి కొనకపోతే హాయిగా నేత బట్టలుగాని, ఖద్దరుగాని కొనరాదా?" అన్నాడు బావ.

" నాజూకుగా వుంటాయని" అన్నాడు నాన్న.

" అయితే సిల్కువి కొనండి" అన్నాడు బావ.

"ఏమిటే అమ్మాయి. మీ ఆయనేదో కేకలేస్తున్నట్టుందీ?"అన్నది అమ్మ అక్కతో.

"నేను చెప్పలేదా" అన్నది అక్క.

*   *   *

తెల్లవారుజామున తలంట్లు పోసుకొని టపాకాయలు కాల్చాలి. అందుకని నాన్న ముందుగానే కొన్ని సీమ

# దీపావళి

పండుగ నేపథ్యంగా...
సామాజిక జీవితాన్ని విశ్లేషించిన
చక్కటి, చిక్కటి కథ....
1946 సంవత్సరం నాటిది-
కాలదోషం
పట్టనిది!!

టపాకాయలూ, మతాబా పుల్లలూ అవీ తెచ్చివుంచాడు.

"నేను ఇప్పుడే రంగు నిప్పుల్లలు కాలుస్తా"నంటూ చిట్టి పంతం పట్టింది.

"ఇప్పుడు కాల్చగూడదమ్మా! రేవు పొద్దున కాలుద్దుగాని. ఏం?" అన్నాడు నాన్న.

"ఇప్పుడే కాల్చాలి" అన్నది చిట్టి.

" ఇప్పుడే కాలిస్తే బావ కోప్పడుతాడు " అన్నాడు బుల్లాడు. అంతకు మునుపు బట్టల విషయంలో బావ కేకలెయ్యడం బుల్లాడు చూశాడు.

"ఏం బావా, కోప్పడుతావా?" అని అడిగింది చిట్టి.

బావ చిట్టినీ, బుల్లాణ్ణీ దగ్గరికి పిలిచి కూచోబెట్టి, " ఇవ్వాళ ఎవరూ టపాకాయలు కాల్చకూడదు. ఎందుకో తెలుసా?" అన్నాడు.

" ఇవాళ కాల్చొచ్చు" అన్నది చిట్టి.

"తెలీ" దన్నాడు బుల్లాడు.

"ఇవాళఎందుకాల్చకూడదంటే, ఇంక నరకాసురుడు చావలేదు. అందుకని కాల్చకూడదు" అన్నాడు బావ.

"నరకాసురుడు చచ్చింతర్వాత కాల్చొచ్చా!" అడిగాడు బుల్లాడు.

" కాల్చొచ్చు" నన్నాడు బావ.

"నరకాసురు డెప్పుడు చస్తాడు?" అడిగింది చిట్టి.

" తెల్లారుజాముకల్లా చస్తాడు. అప్పుడు మనం తలంటి పోసుకొని టపాకాయలు కాలుస్తాం" అన్నాడు బావ.

"నరకాసురుడంటే ఏమిటనుకున్నారు. వాడు రాక్షసుడు. వాణ్ణి చూస్తే ప్రజలందరికీ హడలు. వాడు అందర్నీ తిండి తిననివ్వడు. హాయిగా నిద్రపోనివ్వడు. సుఖంగా బ్రతకనివ్వడు. వాడు మనుష్యుల్ని పశువులల్లే బళ్ళకికట్టి లాగిస్తాడు. లాగని వాళ్ళని కొరడాతో కొడతాడు. వాడు బలవంతుడు. అందుకని వాణ్ని చూసి భయపడి ప్రజలు వాడు చెప్పినట్లల్లా చేస్తారు."

బావకడ్డంవచ్చి చిట్టి " ఎవరైనా వాడు చెప్పినట్టు చేయకపోతే?" అన్నది.

"చెప్పినట్టు చేయకపోతే వాడు చంపేస్తాడు" అన్నాడు బావ.

"అందరూ కలసి వాణ్ని మెత్తగా తంతే?" అన్నాడు బుల్లాడు.

"తంతే చచ్చిపోతాడు. కాని వాణ్ని తన్నడానికి అందరూ కలవాలిగద? అందరూ కలవడానికి ఒక నాయకుడు కావాలి. కృష్ణుడే ఆ నాయకుడు. కృష్ణుడూ, కృష్ణుడి వెంట సత్యభామా కలిసి ప్రజలందర్నీ ఏకం చేసి నరకాసురుడి మీదపడి, వాణ్ని మెత్తగా తన్ని చంపేశారు. నరకాసురుడు చచ్చిపోగానే ప్రజలందరి భయం తీరిపోయింది. చక్కగా అందరూ మళ్ళీ ఇళ్ళల్లో దీపాలు పె

ట్టుకుని తలంట్లు పోసుకుని పండుగ చేసుకున్నారు." అన్నాడు బావ. అయితే మరి, టపాకాయలెందుకు కాల్చారు?" అన్నాడు బుల్లాడు.

"నరకాసురుడు చచ్చినా ఇంకా చిల్లర రాక్షసులు మిగిలారు. వాళ్లు దోమలూ, పురుగులూ అయి మురుగ్గుంటల్లోను, రొచ్చులోను దాక్కుని ప్రజలకనేక విధాల బాధలు తెచ్చిపెట్టారు. వాళ్ళందర్నీ చంపటానికి టపాకాయలు కాల్చవలసి వచ్చింది." అన్నాడు బావ.

"ఇవాళ రాత్రికి నరకాసురుడు చస్తే మనం చూడొచ్చా?" అన్నది చిట్టి.

"నరకాసురుడు చావడం మనం కళ్ళారా చూడగలమా? వాడు ఎక్కడో చస్తాడు. మళ్ళీ ఎక్కడో పుడతాడు. అందర్నీ పీడించుకు తింటాడు. వాడున్నంత కాలమూ ఎవరూ కొంపలో దీపాలుకూడా పెట్టుకోరు. వాడు చచ్చే వరకూ అమావాస్యే. మళ్ళీ వాణ్ని ఏ కృష్ణుడో వచ్చి చంపేస్తాడు. మళ్ళీ కొంతకాలం మన ప్రాణాలకు హాయిగా వుంటుంది. కాని వాణ్ని ఎన్నిసార్లు చంపినా, వాడి తర్వాత వాడి భటులైన రాక్షసులుంటూనే వుంటారు. వాళ్ళని కూడా చంపాలి... మీరు హిట్లరు పేరు విన్నారా?" అన్నాడు బావ.

"నేను హిట్లరు బొమ్మ చూశా!" అన్నాడు బుల్లాడు.

"అయ్యో, నేను చూడలేదే" అన్నది చిట్టీ.

"ముక్కు కింద మీసాలంటించుకుంటాడే, వాడేనా" అన్నాడు బుల్లాడు.

"వాడా? వాణ్ని నేను చూశా." అన్నది చిట్టి.

"హిట్లరు ప్రపంచాన్నంతా మింగటానికి యుద్ధం చేశాడు. యుద్ధం జరిగినన్నాళ్ళూ ఎవరూ రాత్రిపూట దీపాలు వెలిగించలేదు. చివరకు ప్రపంచములోవున్న ప్రజలంతా కలిసి హిట్లరును చంపేశారు. హిట్లరుకు తోడైన వాళ్ళని ఈ మధ్యనే వురి తీసేశారు."

"అందుకనేనా, మనం దీపావళి చేసుకుంటున్నాం" అని అడిగింది చిట్టి.

"ఔను. పెద్ద పెద్ద రాక్షసులు చచ్చిపోయినందుకు పండుగ చేసుకుంటాం. కాని దీపావళి టపాకాయలు కాల్చడమంటే వట్టి పండగ చేసుకోవడమే కాదు, చిల్లర రాక్షసుల్ని కూడా చంపుతామని ప్రతిజ్ఞ చేయాలన్నమాట" అన్నాడు బావ.

"ఎవరీ చిల్లర రాక్షసులు !" అన్నది చిట్టి.

"దురాశా, కోపమూ, గర్వమూ, పొగరూ - ఇటువంటివన్నీ చిల్లర రాక్షసులే. ఈ రాక్షసుల్లోనుంచే మళ్ళీ ఒక నరకాసురుడులాంటివాడు పుడతాడు... ఇందాక బట్టలు పట్టుకొచ్చాడే, ఆ మనిషి ఎవరో తెలుసా?" అన్నాడు బావ.

"తెలుసు" నన్నది చిట్టి .

"ఆయన పేరు సాంబయ్య" అన్నాడు బుల్లాడు.

"ఆ సాంబయ్య వెంట చిన్న రాక్షసి కూడ వచ్చింది. చూశారా?" అన్నాడు బావ.

చిట్టి భయంగా మొహం పెట్టి ,

"లేదే" అన్నది.

"సాంబయ్య వెంట దురాశకూడా వచ్చింది. అయిదు రూపాయలు ఖరీదు చేసే ధోవతులకు పన్నెండు రూపాయలడగమన్నది రాక్షసి సాంబయ్య అడిగాడు."

బుల్లాడు కిలకిల నవ్వాడు. బావకూడా నవ్వాడు.

"సాంబయ్య వెంట వచ్చిన రాక్షసుణ్ని చంపాలా? వద్దా " అన్నాడు బావ. చంపాలన్నది చిట్టి. చంపాలన్నాడు బుల్లాడు నవ్వుతూ.

* * *

తెల్లవారుజామున అందరూ తలంట్లు పోసుకున్నారు. నాన్నా బావకు ఖద్దరు ధోవతులూ, అక్కకి ఖద్దరు చీర కట్టబెట్టాడు. అందరూ సీమ టపాకాయలు కాల్చారు.

"రాక్షసులమాట మరచిపోవద్దేం!" అన్నాడు బావ.

చిట్టి సీమ టపాకాయ అంటించి దూరంగా పారేసి చెవుల్లో వేళ్ళు పెట్టుకుంటూ "మరచిపో"నన్నది.

"రాక్షసుల్ని చంపేవాళ్ళట్లా భయపడతారా" అన్నాడు బావ.

"నాకు భయం లేదు" అంటూ బుల్లాడు కాల్చిన సీమ టపాకాయ చేతిలోనే ఒక వక్కకు తిప్పి పట్టుకుని మొహం ఇంకో వక్కకి తిప్పి కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

సీమటపాకాయ పేలి బుల్లాడి చేతిలోంచీ ఎగిరిపోయింది. బుల్లాడి వేళ్ళు కందినై. వాడు బిక్క మొహంతో వేళ్ళకేసి చూసుకున్నాడు.

"దీనికే భయపడతారా!" అన్నాడు బావ.

"నా చిన్నతనంలో మేం టపాకాయలు కడుతుంటే మందు పేలి మా అందరి చేతులూ, మొహాలూ కాలినై... రాక్షసుల్ని చంపడమంటే మాటలా?" అన్నాడు బావ.



"నాకేం భయం లేదు" అన్నాడు బుల్లాడు.

కొంచెం పొద్దెక్కినాక పక్కయింటి కాంతయ్యగారి భార్య అమ్మను బియ్యం బదులడుగవచ్చింది. ఆ వారం వాళ్ళకి చుట్టాల తాకిడి చాలా తగిలిందట. నాలుగు రోజుల కిందట తిరపతినుండి తిరిగివస్తూ వాళ్ళ పెద్దబ్బాయి మామగారి తాలూకు అయిదారుగురు వచ్చి రెండు రోజులుండి వెళ్ళారుట. నిన్న వాళ్ళమ్మాయిని దిగబెట్టటానికి వస్తూ అయిదారుగురు వేరే పనిమీద వచ్చి ఒక పూట ఉండి పోయినారుట.

"పిల్లా అల్లుడూ వచ్చారు. ఇవాళ్టికి సరిపోతాయో లేదో అన్నట్టుంది. రేవటిమాట ఎట్లాగా అని చూస్తున్నానమ్మా... పాపం" అన్నది అమ్మ.

బావ ఈ సంభాషణ విన్నాడు. అక్కను పిలిచి, "పాపం ఆవిడెవరో బియ్యం కోసం వస్తే, మీ అమ్మ లేదని చెబుతున్నదే చూసి వీలయితే బియ్యం ఇప్పించు" అన్నాడు.

"మీకు పులిహోర యిష్టమని అమ్మ పులిహోర చేద్దామనుకొంటున్నది. అందుచేత నిజంగానే బియ్యం చాలవు" అన్నది అక్క.

"సామెత చెప్పినట్టుంది, వాళ్ళు అన్నం తినటంకన్న మనం పులిహోర తినటం ముఖ్యమా? పులిహోర మానేసి ఆవిడకు కాసిని బియ్యం ఇయ్యమను" అన్నాడు బావ. మధ్యాహ్నం ఒంటిగంట వేళప్పుడు కాంతయ్యగారి రెండో కొడుకు వచ్చి-

"మా అమ్మ కాస్తా యింగువ పెట్టించుకు రమ్మంది" అన్నాడు. అమ్మవాణ్ణి వంటిట్లోకి పిలిచి ఇంగువ యిస్తూ,

"ఇవాళ మీ యింట్లో పిండి వంటలేమిట్రా ?" అని అడిగింది.

"గారెలు, ఆవడాలూ, పులిహోరా!" అని కేక పెట్టి కాంతయ్య కొడుకు ఇంగువ తీసుకుని పరిగెత్తాడు.

"చూశారా! మనం పులిహోరా మానుకుని వాళ్లకి బియ్యమిస్తే వాళ్లు హాయిగా పులిహోరా చేసుకుంటున్నారు" అన్నది అక్క బావతో.

"కాంతయ్య భార్య వెంట రాక్షసి ఉందని గుర్తిలంచ లేదు సుమా!" అన్నాడు బావ.

"చాల్లెండి, మీ రాక్షసులూ మీరూనూ" అన్నది అక్క.

"చూశావా చిట్టీ? చూశావురా బుల్లాడా? కొంతమంది మనుషులు రాక్షసులకు మద్దతు చేస్తుంటే మనవంటి వాళ్లం రాక్షసుల్ని ఎట్లా చంపగలం ?" అన్నాడు బావ.

"అక్కకూడా రాక్షసులకు మద్దతేనా!" అన్నాడు బుల్లాడు.

"అక్కకు రాక్షసులంటే కోపమేగాని మనలో నమ్మకం లేదు. అందుకని మనం రాక్షసుల్ని చంపటం మానేస్తామా!" అన్నాడు బావ.

"మానెయ్యం"అన్నది చిట్టి.

"చంపుతాం"అన్నాడు బుల్లాడు.

* * *

పొద్దూకింది. ఎవిరిళ్ల ముందు వాళ్లు దీపాలు పెట్టుకుంటున్నారు. కొందరి వాకిళ్ల ముందు పిల్లలప్పుడే మతాబులు, తాటాకు టపాకాయలూ, చిచ్చుబుడ్లూ కాల్చడం మొదలుపెట్టారు. వీధులంతా గంధకం పొగ కమ్ముకుంటున్నది.

"వీధుల వెంట తిరిగివద్దాం వస్తారా!" అన్నాడు బావ.

చిట్టి-బుల్లాడు బావ చెరో చెయ్యీ పట్టుకుని బయల్దేరారు.

"రోజూ ఇలా ఉంటే బాగుండునూ?" అన్నది చిట్టి.

"రోజూ రాక్షసుల్ని చంపుతూ కూచుంటే ఇతర పనులు చేసుకోవద్దా?"అన్నాడు బావ.

"టపాకాయలు దీపావళికే వస్తాయిగా రోజూ ఎలా కాల్చటం!"అన్నాడు బుల్లాడు.

"అందరూ టపాకాయలు కట్టరాదు. దానికి లైసెన్సు కావాలి. టపాకాయలు కట్టేవాళ్లు చాలా లాభం తీస్తారు." అన్నాడు బావ.

"మనం రాక్షసుల్ని చంపితే వాళ్లకు లాభం."అన్నాడు బుల్లాడు.

"కొందరు చాటుగా టపాకాయలు కట్టేస్తారు. అది తెలిస్తే పోలీసులొచ్చి పట్టుకుపోతారు." అన్నాడు బావ.

"పోలీసులే రాక్షసుల్ని చంపరాదూ!"అన్నది చిట్టి.

"ఒక్క పోలీసులతో రాక్షసులు చావరు. దానికి అందరూ కావాలి"అన్నాడు బావ.

"అయ్యో! ఈ ఇంట్లో ఎవరూ టపాకాయలు కాల్చటం లేదే! చూడు బావా! చీకటిగా ఎలా ఉందో?" అన్నాడు బుల్లాడు.

"వాళ్లకింకా రాక్షసుల భయం పోలేదు. వాళ్లకి డబ్బు లేదు! వాకిట్లో నిలబడ్డ ఆ పిల్ల చూడు ఎంత కుళ్లు గుడ్డలు కట్టుకుందో! అటువంటి పిల్లకు నరకాసురుడు చచ్చాడన్న సంతోషం ఏముంది" అన్నాడు బావ.

చిట్టి గాని, బుల్లాడుగాని ఏమీ మాట్లాడలేదు. మౌనంగా నడుస్తున్నారు. బుల్లాడు అకస్మాత్తుగా ఆగి, "నేనోసారి ఇంటికెళ్ళొస్తాను బావా, మీ రిక్కడే ఉంటారు గదూ" అన్నాడు.

(తరువాయి 19వ పేజీలో)

# వయోవృద్ధులూ హలో! హలో!! 25



ప్రొఫెసర్, డా. పి.తిరుమలరావు

## స్కూటర్‌కు 'గుడ్‌బై'

వృద్ధుల మయ్యాకా చిన్ననాటి సంగతులు తల్చుకుంటే నరదాగా, మధురంగా వుంటాయి. తిరిగి రాని రోజుల్ని తల్చుకోవడం కన్నా ఆనందానుభూతి ఎక్కడ దొరుకుతుంది? చల్లని జ్ఞాపకాలు- మనసులో గిలిగింతలు పెడతాయి.

మా చిన్నతనంలో నేను సరదాలకు పోయాను. మిత్రులతో కాలక్షేపానికి పేకాట ఆడాను. మధ్య మధ్య బీడీ దమ్ములు లాగుతూ ఆనందంతో గడిపాను. అయితే వాటికి నేను బానిస కాలేదు. సరదాల వరకూ అలాంటివి ఫర్వాలేదు. వాటికి బాగా అలవాటు పడితేనే ఇబ్బంది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ మా మాతామహుల స్వగ్రామం. మా తాతగారు కలపలుపు రంగారావుగారు. ఆయనకు 25 సంవత్సరాలు వచ్చాకా వ్యాపారం నిమిత్తం మద్రాసు వెళ్ళిపోయారు. అక్కడ మంచి మిత్రుల్ని సంపాదించుకున్నారు. వారితో పేకాటాడటం వంటి కాలక్షేపాలతో హుషారుగా గడిపేవారు. డబ్బులు బాగానే ఖర్చుచేసేవారు. మిత్రులు లేనప్పుడు ఇంట్లోవాళ్ళతోనే పేకాట ఆడుతూ సరదాలకు పోయేవారు. శృతిమించకూడదే కానీ ఇదీ మంచి కాలక్షేపమే.

మా తాతగారు డబ్బులకి పేకాట ఆడేప్పుడు కొన్ని సార్లు అప్పులు చేయాల్సి వచ్చేది. అప్పుడు చిల్లర వడ్డీకి డబ్బులు అప్పు తీసుకుని తెచ్చేవారు. పేకాట అలవాటుగా మారితే కాసింత రిస్కు తీసుకోక తప్పదు. మా తాతగారు మాత్రం తెచ్చిన సొమ్ముని తెచ్చినట్టే తీర్చేసేవారు. అదొక మంచి పద్ధతి.

సరే! ఈ విషయాన్ని వదిలేద్దాం. కొందరు మనుషులు స్నేహితుల్నీ, బంధువుల్నీ పట్టించుకోరు. ఎవరితోనూ కలివిడిగా వుండలేరు. ఎవరి దగ్గరా మనసు విప్పరు. ఇదంత మంచి పద్ధతి కాదు. అందరితోనూ కలివిడిగా, స్నేహపూర్వకంగా వుండడం అలవరుచుకోవాలి. నేను ఇలాంటి పద్ధతినే ఇష్టపడతాను. ఇలాంటి పద్ధతినే అనుసరిస్తాను. మా తాతగారి చెల్లెలు అంటే మా అమ్మ మేనత్తగారి మనవడు, ఇప్పుడు నే చెప్పబోయే నడింపల్లి సూర్యనారాయణతో నాకు ఆత్మీయమైన అనుబంధం వుంది. ఆయనకు 70 సంవత్సరాల వయస్సు. బ్యాంకు ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. నిజానికి ఆయన నాకు దూరపు బంధువే అయినా మా మధ్య అలాంటి 'దూరం' లేనేలేదు.

నా చిన్నతనంలో బావ వరసలైన మా అమ్మ మేనత్తగారి కుటుంబంతో సన్నిహితంగా వుండేవాణ్ణి. ఈ బంధుత్వాలు పెంచి పోషించేవి కావు కానీ, ఒక ఆనందానుభూతిని మనసులో మిగుల్చుతాయి. నడింపల్లి సూర్యనారాయణకు నేను రాసిన 'మా తరం కథ' పంపిస్తూ ఏమైనా రాయమన్నాను. ఆయన విపులంగా రాశాడు.

ఈ కంప్యూటర్ యుగంలో సంగతులన్నీ చేతిరాతతో సుదీర్ఘంగా రాస్తే చదవడం కొంచెం కష్టమే! నాకు మల్లేనే ఆయన చెల్లెలు కూడా 'తరములు' అనే పేరుతో ఆత్మకథ రాస్తున్నట్టు తెలిసి తెగ సంతోషించాను. నేను అలా ఎందరినో ఆత్మకథలు రాయమని ప్రోత్సహించాను. చా లా మంది ఏముందండీ రాయడానికి అంటారు. కానీ రాయాలే కానీ చాలా సామాజిక విషయాలు బయటికి వస్తాయి.

నడింపల్లి వారు నాకు ఉత్తరం రాస్తూ మరో విషయం కూడా రాశారు. అది చదివిన తర్వాత నేను ఈ విషయం రాస్తున్నాను. ఆయన స్కూటర్ మీద వెళ్తూ రెండు సార్లు యాక్సిడెంట్లకు గురయ్యారు. ఆయన కాలికి తీవ్రమైన గాయాలయ్యాయి. దీనితో ఆయన స్కూటర్ ఎక్కడం మానుకున్నారు. అది తెలిసి నేను కొంచెం ఆనందించాను. గాయాలు కాలికి కాకుండా తలకో, మరో ముఖ్యమైన అవయవానికో తగిలితే ప్రాణాలకే ప్రమాదం. వయస్సు పెరిగిన తర్వాత స్కూటర్ నడపటం అంత మంచిది కాదు. స్కూటర్ ఎక్కడం కూడా మంచిది కాదని చెప్పాలి. ఇలాంటి వాహనాల కన్నా రిక్షా ఎక్కడం మేలు. లేదా నడవటం ఉత్తమం.

పూర్వం అంటే మేం కుర్రకారుగా వున్నప్పుడు స్కూటర్లు లేవు. సైకిళ్ళే వుండేవి. అవే మమ్మల్ని గర్వపరిచే వాహనాలు. తేలికపాటి వాహనం. తక్కువ ఖర్చుతో సొంతం చేసుకోగల వాహనం. ఇప్పుడు స్కూటర్లు వచ్చాయి, కానీ వాటి ధర వింటేనే గుండె అదురుతుంది. అంతేకాదు మేం సైకిళ్ళు నడిపే కాలంలో ఇప్పుడున్నంత రద్దీలేదు. ఇన్ని యాక్సిడెంట్లు లేవు. ఇప్పుడు ప్రయాణంలో ప్రమాదాలు మామూలయ్యాయి. అసలు ప్రాణానికి హామీ వుండడం లేదు.

మనం జాగ్రత్తగా రోడ్డు పక్కనుంచి వెళ్తున్నా ప్రమాదాల నుంచి తప్పించుకోలేకపోతున్నాం. అటూఇటూ పోయే వాహనాలు మనల్ని ఢీకొంటూనే వున్నాయి. మనం అటూఇటూ చూసుకుని వెళ్తున్నా మన వెనుకనుంచి కూడా వాహనాలు ఢీకొడుతున్నాయి. అంటే ప్రమాదం అనేది మన వెంటనే వుంటోంది. అందుకే వయోవృద్ధులు స్కూటర్ వంటి వాహనాలకు కాస్త దూరంగా వుండడమే మేలు. స్కూటర్ నడిపినప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి కదా అని చాలా మంది వెనుక కూర్చుని ప్రయాణించడం మంచిదనుకుంటారు. అదీ మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు. వృద్ధులకు సాధారణంగా బ్లడ్‌ప్రెషర్ వుంటుంది. అలాంటి వారు స్కూటర్ వెనుక కూర్చుని ప్రయాణిస్తున్నప్పుడు దారిలో ఎక్కడైనా బ్లడ్‌ప్రెషర్ పెరిగి పడిపోవచ్చు. అలాంటి ప్రమాదాలలో తలకి తెబ్బతగిలి మరణించే వారు వున్నారు. అంతే కాదు, రోడ్డు ప్రమాదాలలో వెనుక కూర్చున్న వారికి ఎక్కువ ప్రాణాపాయం జరగవచ్చు. ఈ మధ్యనే నా మిత్రుడు ఒకాయన తన సతీమణితో నిమ్స్ ఆసుపత్రికి వెళ్తుండగా వెనుకనుంచి కారు ఢీకొట్టింది. ఆయన సతీమణి అక్కడిక్కడే మరణించింది. ఇదొక విషాద సంఘటన.

వయోవృద్ధులు అంటే 60 సంవత్సరాలు దాటిన వారు వాహనాలపై తిరిగే సరదాలను వదులు కోవాలి. చిన్నచిన్న ప్రయాణ సాధనాలతో తృప్తి పడటం నేర్చుకోవాలి. లేదా ఆ వయస్సు దాకా గడిచిన ప్రయాణానుభవాలను అవలోకిస్తూ సంతోషంగా గడపాలి. స్కూటర్‌కి గుడ్‌బై చెప్పాలి. వీలైతే కుటుంబ సమేతంగా చిన్నచిన్న టూర్ ప్రోగ్రాములు ఏర్పాటు చేసుకోండి. ఇది ఆరోగ్యానికీ, మనసుకూ ఎంతో ఉల్లాసాన్ని ఇస్తుంది.

మన తరం తర్వాతి తరం ఎంత ఉత్సాహంగా, ఉల్లాసంగా గడుపుతున్నారో పరిశీలించాలి. ప్రపంచంలో వస్తున్న మార్పులు, వేగవంతమవుతున్న జీవితం- ఇలాంటి వాటి గురించి మననం చేసుకుంటూ గత స్మృతుల్ని నెమరువేసుకోండి.

కొన్ని కొన్ని విషయాలను కొందరు తేలికగా తీసుకుంటారు. కొందరు తెలుసుకుని వదిలేస్తారు. కొందరు మాత్రమే పాటిస్తుంటారు. కొత్తగా గ్రహించిన విషయాలను జీవితానికి అన్వయించుకుని ముందుకు సాగే వారికి నా అభినందనలు, ధన్యవాదాలు!

## దీపావళి...

(17వ పేజీ తరువాయి)

బావ 'ఎందు' కన్నాడు. బుల్లాడు పనుందంటూ ఇంటికేసి పరిగెత్తాడు. దూరాన రోడ్డుమీద ఇద్దరు మనుషులు తోటాలు కాలుస్తున్నారు. అందుట్లో ఒకడి చేతిలో తోటా జారి రోడ్డుమీద పడి అన్నివైపులా పరిగెత్తసాగింది. రెండోవాడి కాళ్లసందున దూరి వాణ్ణి భయపెట్టింది.

"ఆ అబ్బికి రాక్షసుల్ని చంపటం చేతకాదు" అన్నది చిట్టి గంభీరంగా.

క్షణక్షణమూ వీధి రంగులు మారుతున్నది. కాస్సేపుఒక ఇంటిముందూ మరి కాస్సేపు మరో ఇంటిముందూ కాంతి వెలుగుతున్నది. మధ్యమధ్యన పెద్ద పెద్ద మోతలుకూడా వినిపిస్తున్నయ్. ఇంతలో బుల్లాడు పరుగెత్తుకుంటూ తిరిగొచ్చాడు. చేతిలో కొన్నిటపాకాయలున్నయ్.

బుల్లాడు రొప్పుతూ, "ఇదిగో టపాకాయలు. ఆ అమ్మాయికిచ్చి రాక్షసులను చంపిద్దాం, ఏం?" అన్నాడు.

బావనోట మాటరాలేదు. బుల్లాణ్ణి అక్కడే వాకిట్లో నిలబడి ఉన్న పిల్ల దగ్గరికి పట్టుకెళ్లి ఆ టపాకాయలా పిల్లకిప్పించాడు. ఇంట్లోనుంచి జబ్బుతో వున్న పిల్లతల్లి బయటకొచ్చింది. బుల్లాడికేసి కృతజ్ఞతతో చూసి కూతుర్ని,

"కాల్చమ్మా కాల్చు!" అన్నది.

బుల్లాడు తెచ్చిన టపాకాయలు కాలుస్తుంటే కళా కాంతీ లేని ఆ బీదపిల్ల మొహం వికసించింది. మతాబాల వెలుతుర్లో ఆ పిల్ల కళ్లతోపాటు బుల్లాడి కళ్లూ, చిట్టి కళ్లూ, బావ కళ్లూకూడా మెరిసినై.